## క్లుప్తంగా

### చెక్కపల్లిలో భగీరథ మహర్షి విగ్రహావిష్కరణ



ముసునూరు: అవమానాలు, అవహేళనలు, అవరోధాలను అధిగమించి సగర జాతి ఐక్యతతో అభివృద్ధిని సాధించాలని నూజివీడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని చెక్కపల్లిలో స్థానిక సగర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సగర జాతి అభివృద్ధికి అందరూ భగీరథ పట్టుదలతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కె.లింగారావు, సగర సంఘ నేతలు, యువకులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు క్విజ్ పోటీలు



తిరువూరు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా తిరువూరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కొరివి పద్మావతి మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను, కథల్లో ఉన్న నీతిని వివరించారు. ప్రతి రోజూ గ్రంథాలయానికి వచ్చి విద్యార్థులు తమకు ఇష్టమైన పుస్తకాలు చదువుకోవచ్చని సూచించారు. పెనుగొలను శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్యారమ్స్, చదరంగం క్రీడల్లో గ్రంథాలయాధికారి శ్రీలత శిక్షణ ఇచ్చారు.

### అగ్రి గోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



నూజివీడు: అగ్రి గోల్డ్ యాజమాన్యం మోసానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఏజెంట్లు, బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని అమర్ భవన్‌లో ఆదివారం అగ్రి గోల్డ్ ఏజెంట్స్, కస్టమర్స్ అసోసియేషన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అగ్రి గోల్డ్ సమస్యపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం నియమించిన కమిటీ త్వరగా చర్యలు చేపట్టి అగ్రిగోల్డ్ బాధితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### ఆదమరిస్తే అంతే సంగతులు



నూజివీడు: నూజివీడు-రెడ్డిగూడెం మార్గంలో మండలంలోని కుక్కలతండా వద్ద తారు రోడ్డు ప్రమాదకరంగా మారింది. తారురోడ్డు మార్జిన్‌లోని మట్టి వర్షాలకు కొట్టుకుపోవడంతో ఏదైనా భారీ వాహనాలు ఎదురైనప్పుడు రోడ్డు దిగడానికి వీలు లేకుండా ఉంది. రాత్రి సమయంలో భారీ వాహనాల హెడ్‌లైట్ వెలుగులో ఏమాత్రం ఆదమరిచి వాహనాన్ని నడిపినా ద్విచక్ర వాహన చోదకులు కింద పడిపోవడం ఖాయం. ఎవరూ ప్రమాదానికి గురి కాకముందే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మార్జిన్‌లో మట్టి పోయించాలని స్థానికులు కోరుతున్నారు.

### స్మారక చిహ్నం ఆవిష్కరణ

ఎ.కొండూరు: మండలంలోని గొల్లమండలలో ఇటీవల మరణించిన కమ్యూనిస్టు సీనియర్ కార్యకర్త దాడి వెంకట్రావమ్మ స్మారక చిహ్నాన్ని ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆవిష్కరించారు. కమ్యూనిస్టు విలువలతో వెంకట్రావమ్మ తుదిశ్వాస వరకు పార్టీ పటిష్టతకు కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. పేదల పక్షాన భూ పోరాటంలో పాల్గొన్న వెంకట్రావమ్మ ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. నాయకులు తూము కృష్ణయ్య, మేకల డేవిడ్, దాడి ఆదినారాయణ, ముచ్చింతల వెంకటేశ్వరరావు, సంగీతరావు, దేవదాసు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత జాబితాలో నివేశన స్థలాలు

- దేవదాయ భూమిగా రికార్డుల్లో నమోదు
- ఏళ్ల తరబడి పరిష్కారం కాని వివాదం
- ఇబ్బందుల్లో పేదలు



నిషేధిత స్థలాల నివాసితుల సంతకాల సేకరణ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు (ఫైల్)

తిరువూరు: తిరువూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో నివాస స్థలాలను దేవదాయ శాఖ భూములుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడంతో గత 16 సంవత్సరాలుగా అమ్మకాలు, కొనుగోళ్లు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిరువూరు శ్రీ వేంకటాచలస్వామి దేవస్థానానికి జమీందార్లు 100 సంవత్సరాల కిందట ఈనాముగా ఇచ్చిన 70 ఎకరాల భూమి పలు మార్లు చేతులు మారి అమ్మకాలు, కొనుగోళ్లు జరిగాయి. తిరువూరులోని శాంతినగర్, అశోక్‌నగర్, బస్టాండు పరిసరాలు, బైపాస్ రోడ్డు ఏరియా, ఆర్ అండ్ బీ అతిథిగృహం చుట్టుపక్కల ప్రాంతాల్లో దేవదాయ భూములుగా నమోదవడంతో ప్రస్తుతం అమ్మకాలు, కొనుగోళ్లు నిలిచిపోయాయి. పేద, మధ్యతరగతి వర్గాలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో కుటుంబ అవసరాలకు స్థలాలు, ఇళ్లు అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. తిరువూరు రెవెన్యూ పరిధిలోని 200/3, 242/1బీ, 244, 235/1, 235/3 సర్వే నంబర్లలో 70 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారు.

**బుట్టదాఖలైన వినతిపత్రాలు**

తమ సమస్యను రెవెన్యూ, దేవదాయ శాఖాధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని బాధితులు వాపోతున్నారు. ఇళ్లు నిర్మించుకుని ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్న తమ స్థలాలను దేవదాయ శాఖ భూములుగా చూపి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. గతంలో రెవెన్యూ గ్రామసభల్లో, ప్రతివారం రెవెన్యూ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్ సెల్‌లో విన్నపాలు సమర్పించినప్పటికీ అధికారులు ప్రభుత్వానికి తమ సమస్యను తెలియజేయట్లేదని వాపోతున్నారు.

**హామీలకే పరిమితం..**

ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు తమ సమస్యను పరిష్కరిస్తామని, అధికారంలోకి రాగానే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని చెబుతున్నా తర్వాత పట్టించుకోవడం లేదని శాంతినగర్, అశోక్ నగర్ ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవదాయ శాఖ ఈనాములుగా ఇచ్చిన భూములను ఆయా వ్యక్తులు ఇతరులకు విక్రయించడం, తదుపరి పలుమార్లు అమ్మకాలు, కొనుగోళ్ల రిజిస్ట్రేషన్లు జరగడం రికార్డుల్లో నమోదైనా, 16 సంవత్సరాల నుంచి మాత్రమే ఈ ఆంక్షలు ఎందుకు విధించారని ప్రశ్నిస్తున్నారు. దేవదాయ శాఖ భూములుగా నమోదుచేసి రిజిస్ట్రేషన్లను నిలిపివేసిన స్థలాల గుర్తింపునకై సీపీఎం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా పట్టణంలో సర్వే చేపట్టారు.

**సమస్యను పరిష్కరించాలి**



తిరువూరులో దేవదాయ శాఖ భూములుగా నమోదైన నివేశన స్థలాల విషయం రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి. ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న కుటుంబాలకు చెందిన భూములు, ఇళ్లను దేవదాయ శాఖ ఈనాం భూములుగా నమోదు చేయడంతో ఇబ్బందులను గుర్తించి వెంటనే రికార్డులు సవరించాలి.

– నల్లగట్ల స్వామిదాసు, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం**



దేవదాయ శాఖ దీర్ఘకాలం కిందట పంపిణీ చేసిన భూములు అమ్మకాలు, కొనుగోళ్లు జరిగినా పట్టించుకోని అధికారులు తదుపరి వాటిపై నిషేధం విధించడం శోచనీయం. ఇంటింటి సర్వే చేసి దేవదాయ శాఖ భూములుగా నమోదు చేసిన సర్వే నంబర్లలోని భూములపై ఆంక్షలు ఎత్తివేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం.

– మేకల నాగేంద్రప్రసాద్, సీపీఎం తిరువూరు పట్టణ కార్యదర్శి

### నూజివీడు సొసైటీలో డిజిటల్ సేవలు



నూజివీడు: సహకార సంఘాల కంప్యూటరీకరణ పూర్తికావడంతో నూజివీడులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ డిజిటల్ సేవలను సంఘ సీఈఓ నీలం నాగేశ్వరరావు నేతృత్వంలో గత నెల 25 నుంచే అందజేస్తున్నారు. ఈ సేవల వల్ల అవినీతి అరికట్టేందుకు వీలవ్వడమే కాకుండా పారదర్శకమైన పాలన రైతులకు అందుతుంది. రుణాల వేగవంతమైన పంపిణీ, లావాదేవీల ఖర్చు తగ్గడం, అన్ని కార్యకలాపాలను నిర్వహించడం వంటి ప్రయోజనాలు చేకూరుతాయి. పీఏసీఎస్‌లను అనుసంధానించడం వల్ల జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకుల మధ్య సమాచారాన్ని మార్పిడి చేయడమే కాకుండా పారదర్శకమైన అకౌంటింగ్ అందుబాటులోకి వస్తుంది.

### ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): అకాల వర్షంతో అపరిశుభ్రంగా మారిన కొండపల్లి మున్సిపాల్టీ వీధుల్లో పారిశుద్ధ్య పనులను కార్మికులు ఆదివారం నిర్వహించారు. వర్షం నీటితో ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో పలు వార్డుల్లో డ్రైయినేజీలు పొంగి పొర్లాయి. డ్రైయినేజీల్లోని వ్యర్థాలతో రోడ్లు అపరిశుభ్రంగా మారాయి. చెత్త, వ్యర్థాలతో పాటు రోడ్ల వెంట ఏపుగా పెరిగిన గడ్డి మొక్కలను కార్మికులు తొలగించారు.

# ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

- పల్లపు ప్రాంతాలు జలమయం
- చల్లబడిన వాతావరణం



నూజివీడులో భారీ వర్షం పడుతున్న దృశ్యం

నూజివీడు: నూజివీడు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం 8 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకొని ఆ తరువాత భారీ వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పట్టణంలోని 10 వార్డులో పల్లపు ప్రాంతాలు, 15 వార్డు ఎన్టీఆర్ కాలనీలో వరదనీరు నిలిచింది. డ్రైయినేజీలు వర్షం నీటితో నిండిపోయాయి. వర్షం నీటిని బయటకు పంపేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.

**ఆగిరిపల్లిలో..**

ఆగిరిపల్లి: మండలంలో ఆదివారం ఉదయం ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు సేద తీరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కోతకు వచ్చిన మామిడికాయలు నేల రాలడంతో మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చాట్రాయిలో..**

చాట్రాయి: మండలంలో ఆదివారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం అకస్మాతుగా వాతావరణం మారడంతో కల్లాలపై ఉన్న ధాన్యం, మొక్కజొన్న పంటపై పట్టాలు కప్పుకున్నారు. చనుబండ పాత దళితవాడలో వర్షం నీరు ఎటూ వెళ్లకపోవడంతో రోడ్డు జలమయమైంది. చీపురుగూడెంలో పిడుగు పాటుకు పలు గృహాల్లో టీవీలు, ఫ్యాన్లు, లైట్లు ధ్వంసమయ్యాయి





ఆగిరిపల్లిలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షం నీరు ; చనుబండ దళితవాడ రోడ్డుపై నిలిచిన నీరు

**కూరగాయ పంటలకు నష్టం**

ఇబ్రహీంపట్నం: అకాల వర్షం, ఈదురు గాలులకు మండలంలోని కూరగాయ పంటలు, అరటి తోటలకు నష్టం వాటిల్లింది. మండల పరిధి గ్రామాల్లో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులతో వర్షం ప్రారంభమైంది. వీచిన గాలులకు జూపూడిలో కూరగాయ పంటలు, కాచవరంలో అరటి తోటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ సిబ్బంది గుర్తించారు. దెబ్బతిన్న పంటల నివేదికను తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు. అనేక పొలాల్లో మొక్కజొన్న కండెలు విరిచి పొలంపై ఉంచారు. అవి కూడా వర్షానికి తడిసి పోయాయి. కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం, మొక్కజొన్న కండెలను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. సమయానికి పరదా పట్టాలు అందుబాటులో లేకపోవడంతో పడరాని పాట్లు పడ్డారు.

# వైద్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చు

**అంకాలజిస్ట్ డాక్టర్ ఫణి రాజకుమార్**



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఫణి రాజకుమార్

తిరువూరు: ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులతో ఇటీవల క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని, వైద్యరంగంలో వచ్చిన ఆధునిక పరిణామాలతో క్యాన్సర్‌ను జయించవచ్చని విజయవాడ రమేష్ హాస్పిటల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఫణి రాజకుమార్ అన్నారు. తిరువూరు సుందరయ్య భవన్‌లో ఆదివారం క్యాన్సర్‌పై జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఫణి రాజ్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ అంటే భయపడాల్సిన అవసరం లేదన్నారు. సరైన ఆహార నియమాలు పాటిస్తూ, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహా మేరకు చికిత్స పొందితే ఈ వ్యాధి నయమవుతుందని చెప్పారు. క్యాన్సర్ రోగులను చులకనగా చూడటం, ఇతరులకు దూరంగా ఉంచడం వారి మానసిక పరిస్థితిపై ప్రభావం చూపుతుందన్నారు. క్యాన్సర్ బారిన పడితే మరణం తప్పదనే అపోహలు వీడాలని సూచించారు. తీవ్ర పరిస్థితుల్లో సైతం క్యాన్సర్ రోగులు మందులు వాడి జీవనకాలాన్ని పెంచుకోవచ్చని చెప్పారు. క్యాన్సర్ అంటువ్యాధి కాదని, వ్యాధిగ్రస్తులు తమ దైనందిన పనులు చేసుకోవచ్చని సూచించారు. వైద్యులు డాక్టర్ రవీంద్ర, రామకోటేశ్వరరావు, సుభాష్, సత్యతేజ, మధుకీర్తి, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు గంగాధర్, హరికృష్ణ, సుధాకర్, సుదర్శన్, పాపారావు పాల్గొన్నారు.

# యువత ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలి

**బీబీఏ అధ్యక్షుడు ఏకే బాష**



సీకే బాషను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం, సిబ్బంది

ఇబ్రహీంపట్నం: యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళితే ఏ సమస్యనైనా అధిగమించవచ్చునని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు ఏకే బాష అన్నారు. స్థానిక జాకీర్ హుస్సేన్ డిగ్రీ కళాశాల 2001–2004 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కళాశాల ఆవరణలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మనం ఏ దేశం వెళ్లినా మాతృభూమిని మరువరాదన్నారు. యువత పాశ్చాత్య సంస్కృతిని వీడి నైతిక విలువలు కలిగి ఉండాలని చెప్పారు. మరో మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఉగ్రవాద చర్యలను నిరసించాలన్నారు. దేశ ప్రజలంతా ఉగ్రవాద నియంత్రణకు ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏకే బాషాను కళాశాల యాజమాన్యం సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జాఫర్ సాదిక్, మస్తాన్‌వలి, అధ్యాపకులు బందగీ బేగ్, అబ్దుల్ ముజీబ్, నాగుల మీరా, సంతోష్ కుమార్, పూర్వ విద్యార్థులు జె.గోపాలకృష్ణ, దేవా, సలీం, కారుమంచి దుర్గారావు, జల్లి కాంతారావు, జ్యోతి, ఝాన్సీ, న్యాయవాది బి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా నీట్ పరీక్ష





జూపూడి నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో నీట్ పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు ; విద్యార్థుల హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: దేశవ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత (నీట్) పరీక్ష స్థానిక నిమ్రా వైద్య, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షకు వివిధ ప్రాంతాల నుంచి 960 మంది విద్యార్థులను కేటాయించగా, 948 మంది విద్యార్థులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు. పరీక్ష నిర్వహణకు పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

# క్రీడా శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



క్రీడాకారులతో డీవైఈఓ ఎం.సేవియా

నూజివీడు: వేసవి క్రీడా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీవైఈఓ ఎం.సేవియా పేర్కొన్నారు. పట్టణంలోని వీటీహెచ్ గ్రౌండ్‌లో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాస్కెట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్ బాల్, బాల్ బాడ్మింటన్ వేసవి క్రీడా శిబిరాన్ని ఆదివారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా చేయకుండా క్రీడల్లో శిక్షణ పొంది తమలో క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. నెలరోజుల పాటు ఈ శిబిరాలను ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కోచ్ వాకా నాగరాజు, పీడీలు లక్ష్మి, వనజ, సతీష్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# చెట్టు విరిగి ఇంటిపై పడి బాలుడి మృతి





కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి పార్థసారథి (ఇన్‌సెట్) మృతుడు బాల గోవింద్ (ఫైల్)

ముసునూరు: ఆదివారం వీచిన ఈదురుగాలులు మండలాన్ని అతలాకుతలం చేశాయి. ఉదయం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కురిసిన వాన ధాటికి పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. చెక్కపల్లిలో ఈదురుగాలి ధాటికి భారీ వృక్షం విరిగి ఇంటిమీద పడటంతో ఇంట్లో ఉన్న పన్నెండేళ్ల బాలుడు మామిళ్ల బాలగోవింద్ మృతిచెందగా, కుటుంబ సభ్యులు గాయపడ్డారు. మండలంలోని చెక్కపల్లి, వలసపల్లి, వేల్పుచర్లల్లో ఎనిమిది విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. 150 మీటర్ల విద్యుత్ కేబుల్, రమణక్కపేటలో 11 కేవీ లైన్ కండక్టర్ దెబ్బతింది. విద్యుత్ శాఖకు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లింది. అక్కిరెడ్డిగూడెంలో అరటి పంట దెబ్బ తినగా, రమణక్కపేట, లోపూడి, సూరేపల్లిల్లోని మామిడి తోట ల్లో కాయలు నేల రాలాయి. రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ ఎం.చిరంజీవి ఆధ్వర్యంలో ఆటంకాలు తొలగించి, రవా ణా సౌకర్యాలను పునరుద్ధరిస్తున్నారు. విద్యుత్ శాఖ ఏఈ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పడిపోయిన విద్యుత్ స్తంభాలు, కేబుల్, విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనులు ప్రారంభించారు.

**మంత్రి పార్థసారథి పరామర్శ**

నూజివీడు: మృతుడు మామిళ్ల బాలగోవింద్ కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శించారు. బాలగోవింద్ మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా అక్కడకు విచ్చేసిన మంత్రి మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

# 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగిస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏపీ సెక్యూరిటీ గార్డ్స్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయిబాబు మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సెక్యూరిటీ గార్డ్స్‌తో సహా 50 లక్షల మంది కార్మికులు పనిచేసే షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు సవరించలేదన్నారు. వేతనాల కోడ్ పేరిట జాతీయ కనీస వేతనం పేరుతో కార్మికుల వేతనాలపై దాడి జరుగుతుందని చెప్పారు. ఈ నెల 10లోగా సదస్సులు, 17, 18 తేదీల్లో మోటార్ సైకిల్ జాతాలు నిర్వహించాలని, 20న సమ్మె సందర్భంగా నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

# సత్ప్రవర్తనతో మెలగాలి

**తిరువూరు ఎస్‌ఐ సత్యనారాయణ**

తిరువూరు: గతంలో పలు నేరాల్లో పాల్గొని రౌడీషీటర్లుగా ముద్రపడిన వారు ఇకనైనా సత్ప్రవర్తనతో మెలగాలని తిరువూరు ఎస్‌ఐ సత్యనారాయణ అన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అల్లర్లకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రౌడీషీటర్లపై, పాతనేరస్తులపై నిఘా ఉందని, ఎటువంటి అనుమానం వచ్చినా విచారణ చేస్తామని చెప్పారు.

# ఇసుక టిప్పర్లు స్వాధీనం

విస్సన్నపేట: అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను విస్సన్నపేట పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి నూజివీడు రోడ్డులో ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను గుర్తించి సీజ్ చేశామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

# 225 మందికి కంటి పరీక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక శ్రీసత్యసాయి మందిరంలో ఆదివారం శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు 225 మందికి కంటి పరీక్షలు చేసి, 105 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరిలో మొదటి విడతగా 45 మందిని ఆపరేషన్ నిమిత్తం విజయవాడకు తీసుకెళ్లినట్లు శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ చిట్టూరి కొండ తెలిపారు.